

కథ

డా.అడబాల అప్పారావు

# చిన్నగీత-పెద్దగీత

ధర్మభిక్షం రింగు రింగులుగా పొగ వదుల్తున్నాడు సిగరెట్ స్టైల్‌గా కాలుస్తూ బస్టాండులో నిలబడి అప్పుడే ఫ్రెష్‌గా తయారై ఆఫీస్‌కి బయలుదేరే అమ్మాయిల వంక చూస్తూ కాలుస్తుంటే ఇంకా మజాగా ఉంది. అందుకే తన జీతంలో ఓ టెన్ పర్సంటూ, జీవితంలో ఓ ట్వంటీ ఫైవ్ పర్సంటూ ఇలా సిగరెట్లకి తగలేస్తున్నాడు. ఈ ప్రపంచంలో తన ఉద్యోగాన్నీ భార్యాపిల్లల్నీ కూడా అవసరమైతే త్యాగం చెయ్యగలడేమోగానీ ఈ సిగరెట్‌ని మాత్రం ఒదులుకోలేడు.

సిగరెట్ పొగ రింగు రింగులుగా గాలిలో తేలిపోతోంటే తను ఊహల్లో తేలిపోతున్నాడు. ఎక్కడెక్కడికో వెళ్ళిపోతున్నాడు. తన కాలేజీ రోజులూ..క్లాసులెగ్గొట్టి సినిమాలకి పోవడం, అమ్మాయిలకి బీట్లు కొట్టడం, రాణీ చేతిలో చెప్పుదెబ్బతినడం, ఇలా ఒక్కటేమిటీ అనేక గతస్మృతుల్లోకి ఒకేసారి మునిగిపోయాడు.

ఇంతలో భుజం మీద వెనక మంచి ఏదో ఓ కర్ర లాంటిది వాలినట్లుంటే తిరిగి చూశాడు ధర్మభిక్షం. అవును అది కర్రే! దాన్నే పోలీసులు లాఠీ అంటారు. ఆ వెనకాలే గుడ్లురుముతూ కానిస్టేబుల్ భేరుండం. ధర్మభిక్షానికి కంగారెత్తింది.

“తియ్ రెండొందలు!” హుంకరించాడు భేరుండం.

“ఎందుకూ?!” వెర్రిమొహంపెట్టి అడిగాడు ధర్మం.

“నువ్వు చేస్తున్న పాడుపనికి”

“ఏంటా పాడు పని?” బేలగా అడిగాడు.

“సిగరెట్ కాలుస్తూ రింగురింగులుగా పొగ వదుల్తున్నావే అందుకు” చిరాకూ, కోపం కలగలిపి అన్నాడు భేరుండం.

“ఓ, సారీ! ఇకనుంచి రింగు రింగులుగా వదలడం మానేస్తాను. స్ట్రెయిట్‌గా ఊదేస్తాను” అంటూ భేరుండం ప్రోబ్లమ్ అర్థంచేసుకున్న వాడిలా ‘ఉఫ్’ అంటూ పొగను స్ట్రెయిట్‌గా వదలడం మొదలెట్టాడు.

“వెధవ తెలివితేటలు కట్టిపెట్టి సిగరెట్ అవతల పారేసి నాకు రెండొందలియ్!” కసిరాడు భేరుండం.

“ఎందుకు తియ్యాలిసార్ రెండొందలు?” అర్థం కాక అడిగాడు.

“నువ్వు ఇక్కడ సిగరెట్ కాలుస్తున్నందుకు!” నొక్కి వక్కాణించాడు భేరుండం.

“ఓ అదా! సిగరెట్ కాలిస్తే రెండొందలు, బ్రాందీ తాగితే ఐదొందలూ, రేప్ చేస్తే...ఇలా రేట్లు ఫిక్స్ చెయ్యడం ఏం బాగోలేదు అసలే కూరగాయల రేట్లు పెరిగిపోయి ఏడ్చి ఛస్తున్నాం”

“నోర్ముయ్! నిన్న టీవీ చూశావా!”

“లేదు”

“నిన్న అక్టోబర్ రెండు, గాంధీ జయంతి. నిన్నట్నుంచీ పబ్లిక్ ప్లేస్‌లో సిగరెట్ కాల్చిన వాళ్ళ దగ్గర నుంచీ రెండొందలు చొప్పున...”

“ఓ అర్థమయింది సార్! నిన్నట్నుంచీ మీరు ఓపెన్‌గా పబ్లిక్ ప్లేసుల్లో లంచాలు తీసుకునే కార్యక్రమం పెట్టుకున్నారన్నమాట! మీమీద నాకా నమ్మకం ఉంది!”

“ఛస్ నోర్ముయ్! చెప్పేది పూర్తిగా విని ఏడువ్!” మళ్ళీ అందుకున్నాడు భేరుండం.

“అక్టోబర్ రెండునించీ బహిరంగ ప్రదేశాల్లో పొగ త్రాగడం నిషేధం. అలా చేసిన వాళ్ల దగ్గర్నుంచి రెండొందలు చొప్పున జరిమానా వసూలు చెయ్యమని ప్రభుత్వం ఆర్డరు వేసింది. కాబట్టి నువ్వు రెండొందలు కట్టు!” రెండొందలూ కక్కించడానికి ప్రయత్నించాడు భేరుండం.

ధర్మభిక్షానికి మతిపోయింది. షాక్ నుంచి తేరుకుని జేబులో చెయ్యి పెట్టి వెతికాడు. యాభై రూపాయలకన్నా ఎక్కువ లేవు. ఏం చెయ్యాలో తోచడం లేదు.

“నా దగ్గర ఈ యాభయ్యే ఉంది” దీనంగా ఉంది ఆ స్వరం.

“అయితే నడు స్టేషన్‌కి” గద్దించాడు భేరుండం.

కొంచెం మొహానికి నవ్వు పులుముకుని “హి!హి! మనిద్దరం ఓ అండర్ స్టాండింగ్‌కి వస్తే బావుండేదేమో!” అన్నాడు ధర్మం.

“ఏమిటిదీ!” అనుమానంగా చూశాడు భేరుండం.

“ఏం లేదూ! ఈ రెండొందలూ నా దగ్గర ఫైన్ పట్టుకెళ్ళి గవర్నమెంటుకి కడితే నీకేమొస్తుంది చెప్పు. అందుకనీ...” బుజ్జగింపుగా అన్నాడు ధర్మం.

“అందుకనీ!” మొహం ఎర్రబారింది భేరుండానికి.

“ఈ యాభై తీస్కోని నన్నొదిలెయ్? వాటితో చక్కగా ఇంటికి ఓ పావుకిలో టమోటాలు తీసుకెళ్ళు! మీ ఆవిడ సంతోషిస్తుంది” ఉపాయం చెబుతున్నట్టుగా అన్నాడు.

“అసలు నేనెలా కనబడుతున్నానా నీకు! నిప్పు! నిప్పురా ఈ భేరుండం. కనిపించని నాలుగో సింహమేరా ఈ భేరుండం!” ఊగిపోతూ అన్నాడు.

“ఓహో! ఆ బాపతా!” అన్నాడు ఏదో సినిమా డైలాగ్ గుర్తొచ్చి.

“ఏడిశావ్‌గానీ స్టేషన్‌కి నడు!” గద్దించాడు భేరుండం. చేసేదిలేక బయలుదేరాడు ధర్మభిక్షం.

* * *

ధర్మభిక్షాన్ని యస్సై ముందు నుంచోబెట్టి ఓ ఇంటర్నేషనల్ క్రిమినల్‌ని పట్టుకున్నంత బిల్డప్ ఇచ్చాడు భేరుండం. రాత్రి జరిగిన మర్డర్ కేసులో తెల్లవార్లూ శవం దగ్గర కాపలా ఉండి నిద్రలేకపోవడంతో కళ్ళు మంటలెక్కి ఉన్నాడు యస్సై. భేరుండం విషయం వివరించగానే కళ్ళు మంటలతోపాటు వళ్ళు మంట కూడా ఎక్కింది యస్సైకి. వినీవినగానే.

“తోసెయ్ వీణ్ణి సెల్లోకి!” అన్నాడు యస్సై.

“సిగరెట్ తాగినందుకే ఇంత పెద్ద శిక్షా! మరి మందుతాగేవాళ్ళ నెందుకు వదిలేస్తున్నారు?” తెలివిగా ప్రశ్నించాడు. ధర్మభిక్షం సెల్లోకి నడుస్తూ.

“నీ పక్కనున్న కామయ్య మందు తాగి ఆడవాళ్ళతో తిక్కతిక్కగా మాట్లాడితేనే సెల్లోకి తోసింది” చెప్పాడు భేరుండం.

“మందు తాగినందుకే జైల్లో పెట్టేస్తే మరి మానభంగాలు చేసేవాళ్ళని ఎందుకొదిలేస్తున్నారు!” అన్నాడు కామయ్య.

“నీ వెనకాలున్న రవిగాడు రేప్ ఎటంప్ట్ చెయ్యబట్టే మక్కెలిరగతన్ని లోపలికి తోశాం!” చెప్పాడు భేరుండం.

“అది సరే! మరి మర్డర్లు చేసినవాళ్ళు బయట కాలర్లు ఎగరేసుకు తిరుగుతున్నారే? పైగా ఈమధ్య వాళ్ళు ఎలక్షన్లలో కూడా నిలబడుతున్నారే! మరి వాళ్ళ మాటేంటీ! ” విశ్లేషణాత్మకంగా అడిగాడు ధర్మభిక్షం.

“చూడు ధర్మభిక్షం మర్డర్లు చేసిన వాళ్ళని కూడా వదిలిపెట్టేది లేదు. నీ పక్కసెల్లో ఉన్న కాళిదాసుని కుళ్ళబొడుస్తున్నదందుకే!”

“మర్డర్ చేయించిన వాళ్ళనేమీ చేయలేక పోతున్నారు కదా మీరు. దేశాన్ని నిలువునా దోచుకునే రాజ

కీయ నాయకులన్నీ, లంచగొండి ఉద్యోగుల్నీ, కంట్రాక్టర్లనీ వదిలిపెట్టేస్తున్నారు కదా!" అన్నాడు ధర్మభిక్షం.

"దొరికితే వాళ్ళనీ పట్టుకుంటాం!" ఆవేశంగా ఊగిపోతూ అన్నాడు యస్సై ఓ పక్క కళ్ళు నలుపుకుంటూ.

"వాళ్ళు మీకు దొరకరు!" ధీమాగా చెప్పాడు ధర్మభిక్షం.

"ఏం!" అడిగాడు యస్సై.

"అదంతే!" అన్నాడు ధర్మం.

* * *

ధర్మభిక్షం తన ఫ్రెండ్ సుభిక్షానికి ఫోన్ చేశాడు. సుభిక్షం వెంటనే ప్రత్యక్షమయ్యాడు పోలీస్‌స్టేషన్‌లో. విషయం తెలుసుకుని సుభిక్షం రెండొందలూ ధర్మభిక్షం తరపున ఫైన్ కట్టాడు. ధర్మభిక్షం బయటికొచ్చాడు. సుభిక్షానికి థ్యాంక్స్ చెప్పాడు. సుభిక్షం ఆఫీస్‌కి లేటవుతుంది సాయంత్రం కలుస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

ధర్మభిక్షం ఒంటరిగా బయలుదేరాడు. కించిత్ అవమానభారంగా కూడా ఉంది. ఈ పూట ఆఫీస్ కెళ్ళకుండా యింటి కెళదామని వెనక్కి ప్రయాణమయ్యాడు. మనసు అదే విషయమై ఆలోచించడం మొదలుపెట్టింది. తను పోలీస్‌స్టేషన్లో పెద్దపెద్ద నేరం చేసిన వాళ్ళను ప్రస్తావించి తన తప్పును కప్పిపుచ్చే ప్రయత్నం చేశాడు. తను చేసిన చిన్న తప్పు పక్కన పెద్ద గీతలు గీసి తన నేరాన్ని మరింత చిన్నదిగా చూపే ప్రయత్నం చేశాడు. అది ఎంతవరకు సబబు? ప్రతి నేరస్తుడికీ తను చేసే తప్పు చిన్నదే! తను చేసే తప్పు సమర్థనీయమే! చిన్నతప్పే కదా అని చేసుకుంటూ పోవడమే అసలు తప్పులకు మూలం. ముందు ఈ ప్రవృత్తి నుంచి బయటపడాలి అని గట్టిగా నిర్ణయించుకున్నాడు. వడివడిగా తన యింటి వైపు అడుగులు వేశాడు.

* * *

ధర్మభిక్షం బయటి కెళ్ళిన తరువాత యస్సైలో ఓ కదలిక ప్రారంభమైంది. నిజానికి ధర్మభిక్షం మాటలు తనను ఆలోచింపచేసాయి. సిగరెట్లూ, మద్యం తదితరాలు విచ్చలవిడిగా మార్కెట్‌లో ఓ పక్కన వ్యవస్థ ప్రోత్సహిస్తూ వాటికి అలవాటుపడ్డ సామాన్య ప్రజలను నేరస్తులుగా నిలబెట్టడం ఎంతవరకు సబబు? ముందు సమస్యకు మూలమైన వాటిని పరిష్కరించకుండా వాటి పర్యవసానాలపై పోరాడటం నీడతో యుద్ధం చేయడం లాంటిదే.



ధర్మభిక్షం అన్నది ఓ రకంగా కరెక్టే! అతను చెప్పినట్టు చిన్న చిన్న నేరం చేసేవాళ్ళను, అసహాయులనే తను సర్వీసులో ఎక్కువగా పట్టుకున్నాడు. ఏనాడు నేరాలకు మూలమైన పెద్ద నేరగాళ్ళను ఏం చేయలేకపోయాడు. తాను పనిచేస్తున్న వ్యవస్థలోని లొసుగుల్ని ఆసరా చేసుకుని వారు తప్పించుకుంటున్నారు. అవును పెద్దగీతల్ని అలానే వదిలేసి చిన్నగీతల్ని చెరిపే ప్రయత్నమే జరుగుతోంది. ఇది మారాలి! గట్టిగా అనుకున్నాడు యస్సై. ఠంగున మోగింది గోడగడియారం ఉదయం పదిన్నరకు తన ఆశకు ఊతమిస్తున్నట్టుగా.

○